HICON SERIES

CLASS 5 TELUGU

తెలుగు వెలుగు 5

LESSON 3






CLICK HERE TO ACTIVATE

**LESSON**
PART 1

# 3 ఎవరు గొప్ప?

అనగనగా ఒక రాజుగారు. ఆ రాజుగారికి గర్వం ఎక్కువ. తనను మించిన వాడు ఈ భూమిపై ఎవ్వరూ లేరనే గట్టి నమ్మకం ఆయనది. ఈ విషయాన్ని రాజ్యంలోని ప్రతి ఒక్కరూ తన ముందు వినిపించాలని రాజుగారి కోరిక.



అందుకే కవులను, సత్పురుషులను, పండితులను, అధికారులను, సైనికులను, ప్రజలను అందరినీ పిలిపించి తన మనసులోని ఆకాంక్షను చెప్పాలని కోరాడు. ఎవ్వరూ చెప్పలేకపోయారు. " ఓ రాజా ! మీ అంతటివారు ఈ భూమండలంలో లేనే లేరు" అని ఒక్కరు కూడా చెప్పలేదని రాజుగారు బాధపడ్డాడు, దుఃఖించాడు. తుదకు మహామంత్రిని పిలిచి, "నా మనసులోని మాటను ఊహించి చెప్పగలిగే వారిని రాజ్యంలో ఎక్కడున్నా వెతికి పట్టుకు రండి. మీకు నెలరోజులు గడువు ఇస్తున్నాను" అని ఆజ్ఞాపించాడు.


మరుసటి రోజు నుండి అన్ని పనులను మానేసి, మహామంత్రి యోగులను, సన్యాసులను, రైతులను, వ్యాపారులను అందరినీ కలిసి రాజుగారి మనసులోని కోరిక ఏమిటో చెప్పమని అడిగాడు.

ఎవ్వరూ రాజుగారి మనసులో మాటను గ్రహించలేకపోయారు. మహామంత్రి కుమారుడు తండ్రి పరిస్థితిని అర్థంచేసుకొని మధ్యమధ్యలో ధైర్యం చెప్పేవాడు. చివరికి గడువు తీరే రోజు వచ్చింది. "నాన్నగారూ! మీరు ధైర్యంగా ఉండండి. నేను మారుమూల పల్లెటూరి నుంచి ఒక గొర్రెల కాపరిని తెచ్చాను. ఆయన రాజుగారి కోరికను బయటపెడతాడు. ఎందుకంటే ఆయన మాట్లాడే భాష రాజుకు, రాజు మాట్లాడే భాష కాపరికి అర్థం కాదు. కాబట్టి, వారి మౌన సంభాషణతో మన సమస్య తీరుతుంది", అని కొడుకు మంత్రితో అన్నాడు.

మంత్రి సరేనని గొర్రెల కాపరిని రాజువద్దకు తెచ్చి సభలో ప్రవేశపెడతాడు. రాజుగారు సింహాసనంపై కూర్చుంటే భయం భయంగా ఆయన వైపు చూస్తాడు కాపరి. ఎంతసేపైనా నోరు మెదపలేదు కాపరి. అప్పుడు రాజుగారు మంత్రి వైపు చూసి "వచ్చిన వాడు ఏం మాట్లాడడంలేదు ? ఎందుకు ?" అని ప్రశ్నిస్తాడు. దానికి మంత్రిగారు "మీ భాష వాడికి అర్థం కాలేదు. కానీ మీ మనసులో ఏముందో వాడు చెప్పగలడు" అని సమాధానమిస్తాడు.

ఆ సమయంలో రాజుగారు కాపరివైపు ఒక వేలు చూపిస్తాడు. గొర్రెల కాపరి కొంచెం ధైర్యం తెచ్చుకొని సమాధానంగా రెండు వేళ్ళు చూపించాడు. రాజుగారు మూడు వేళ్ళు చూపించగానే గొర్రెల కాపరి తల అడ్డంగా విదిలించి కోపంతో వెళ్ళిపోయాడు.

సభ అంతా వీరిద్దరి మౌన సంభాషణను పరిశీలించింది. కొంతసేపటికి రాజుగారు సంతోషించి "మా ఇద్దరి సైగలను మీరెవరైనా గ్రహించారా ?" అని ప్రశ్నిస్తే సభ్యులెవరూ సమాధానం చెప్పలేదు. అప్పుడు మంత్రి "మీరే చెప్పండి" అని రాజును కోరాడు.



"ఈ ప్రపంచంలో నేనే గొప్పవాణ్ణి అని ఒక వేలు చూపిస్తే, కాపరి రెండు వేళ్ళు చూపించాడు. ముందు దేవుడు, ఆ తర్వాత మీరు, ఇద్దరూ గొప్పవాళ్ళే అనే అర్థం వచ్చేటట్లుగా. దానికి నేను మమ్మల్ని మించిన మూడో వ్యక్తి ఇంకెవరైనా ఉన్నారా అన్నట్లు మూడు వేళ్ళు చూపించాను. మూడోవ్యక్తి ఉండటానికి వీల్లేదు అనే అర్థం కలిగేటట్లు కోపంతో గొర్రెల కాపరి వెళ్ళిపోయాడు. నా ఆకాంక్షను గ్రహించిన ఆ మహానుభావుడికి రేపు సభలో ఘన సన్మానం చేద్దాం. మంత్రిగారూ ! ఆ ఏర్పాట్లు చూడండి" అని చెప్పి రాజుగారు వెళ్ళిపోయారు.

తర్వాత మంత్రిగారు, అతని కుమారుడు ఇద్దరూ గొర్రెల కాపరిని పిలిపించి "సభలో నీవు చేసిన సైగల అర్థం మాకు చెప్పు" అని అడిగారు.

దానికి గొర్రెల కాపరి " అయ్యా ! నాకు మూడు గొర్రెలు ఉన్నాయి. అవే నాకు జీవనాధారం. రాజుగారు ఒక వేలు చూపించి ఒక గొర్రె అడిగారు. ఒకటేం బాగుంటుందని నేను రెండు గొర్రెలు ఇస్తానని రెండు వేళ్ళు చూపించాను. కానీ రాజుగారు మూడు వేళ్ళు చూపించి మూడు గొర్రెలు కావాలని అడిగారు. నావల్లకాదని కోపంతో అక్కడినుంచి పారిపోయివచ్చాను" అని మంత్రితో చెప్పాడు. మహామంత్రి, ఆయన కుమారుడు పొట్ట చెక్కలయ్యేలా పగలబడి నవ్వారు. గొర్రెల కాపరి సన్మానానికి తగు ఏర్పాట్లు చేశాడు మహా మంత్రి.



## అభ్యాసం

## I. అర్థాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఆకాంక్ష | = | కోరిక | జీవనాధారం | = | బ్రతుకుదెరువు |
| పరిశీలించుట | = | చూచుట | తుద | = | చివర |
| సన్మానం | = | సత్కారం | | | |

## II. పదజాలం

**(అ) ఈ క్రింది పదాలను ఒకే వాక్యంలో ఉపయోగించి రాయండి.**

రాజు – భూమి – నమ్మకం

వాక్యం : – ఈ భూమిపై తనంత గొప్పవాడు లేనేలేడని రాజుగారి నమ్మకం.

1. మంత్రి – ఆలోచన – ప్రజలు

_______________

2. తండ్రి – కుమారుడు – ధైర్యం

_______________

3. మనసు – అజ్ఞాని – మాట

_______________


4. కాంక్ష – యువకుడు – శిఖరం

_______________

5. సమస్య – దుఃఖం – పరిష్కారం

_______________

(ఆ) ఈ క్రింద రాజుగారికి సంబంధించిన పదాలు ఇవ్వబడినాయి. గొర్రెల కాపరికి సంబంధించిన మాటలు రాయండి.




(ఇ) ఈ క్రింది వాక్యాలలో గీత గీసిన మాటలకు అదే అర్థాన్నిచ్చే మాటలను గుర్తించండి.

1. రాజయ్యకు అహంకారం ఎక్కువ. ( )
   ఎ) గర్వం బి) దానం సి) పరోపకారం
2. పెద్దయిన తర్వాత టీచర్ కావాలని రవి ఆకాంక్ష. ( )
   ఎ) ఊహ బి) కోరిక సి) ఉపకారం
3. మంత్రిగారి మదిలోని మాటను ఎవరూ కనిపెట్టలేక పోయారు. ( )
   ఎ) పుస్తకం బి) అంతఃపురం సి) మనసు
4. మా కుటుంబమంతా నెల రోజులు తీర్థయాత్రలకు వెళ్ళాం. ( )
   ఎ) వర్షం బి) అహ్నం సి) మాసం

## III. ప్రశ్నావళి

(అ) ఈ క్రింది ప్రశ్నలకు రెండు లేక మూడు వాక్యాలలో జవాబులు రాయండి.

1. రాజు గారి బలమైన నమ్మకం ఏమిటి ?
2. రాజు గారు ఎందుకు బాధపడ్డాడు ?
3. మంత్రి కొడుకు మంత్రి గారికి ధైర్యం ఎలా చెప్పాడు ?
4. గొర్రెలకాపరి సభలో నుంచి కోపంతో ఎందుకు వెళ్ళిపోయాడు ?
5. ఈ కథ ద్వారా మీకేం అర్థమైంది ?

**(ఆ) ఈ క్రింది ప్రశ్నలకు ఆరు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. మంత్రి, ఆయన కుమారుడు పొట్ట చెక్కలయ్యేటట్లు ఎందుకు నవ్వారు ?
2. ఈ కథలో ఏదైనా ఒక సన్నివేశాన్ని సంభాషణల రూపంలో రాయండి.

## IV. వ్యాకరణం

రంజని పాట మధురంగా పాడింది.

తిక్కన మహాభారతం రాశాడు.

పై వాక్యాలను గమనించండి. పాట మధురంగా పాడింది ఎవరు ? మహాభారతం రాసింది ఎవరు ? అనే ప్రశ్నలకు వరుసగా రంజని, తిక్కన జవాబులుగా వస్తాయి. పనిని చేసేవారు అంటే, "ఎవరు" అనే ప్రశ్నకు సమాధానంగా వచ్చే మాటను వాక్యంలో "**కర్త**" అని అంటారు.

రంజని దేనిని పాడింది ? తిక్కన దేనిని రాశాడు ? అనే ప్రశ్నలకు పాట, మహాభారతం అనే మాటలు జవాబులు. కర్తచేసే పని ఫలితాన్ని అనుభవించే దానిని అంటే "ఎవరిని", "దేనిని" "ఎవరికి", "దేనికి" అనే ప్రశ్నలకు జవాబుగా వచ్చే మాటలను "**కర్మ**" అంటారు. కర్త చేసే పనిని తెలిపే మాటలు, అనగా "పాడింది", "రాశాడు" వంటి మాటలను "**క్రియలు**" అంటారు.

పల్లవి చదరంగం ఆడుతున్నది.

ఈ వాక్యంలో కర్త – పల్లవి. కర్మ – చదరంగం. క్రియ – ఆడుతున్నది.

వినయ్ ఉద్యోగం చేస్తున్నాడు.

ఈ వాక్యంలో కర్త – వినయ్. కర్మ – ఉద్యోగం. క్రియ – చేస్తున్నాడు.

**(అ) ఈ క్రింది వాక్యాలలో కర్త, కర్మ, క్రియలను గుర్తించండి.**

| | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| 1. శ్యామ్ పుస్తకం చదువుతున్నాడు. | | | |
| 2. వనజ టి.వి చూస్తున్నది. | | | |
| 3. మౌలాలి క్రికెట్టు ఆడుతున్నాడు. | | | |
| 4. అబ్రహం కూరగాయలు కొంటున్నాడు. | | | |
| 5. వాల్మీకి రామాయణం రాశాడు. | | | |

## V. ప్రాజెక్టు పని



ఏదైనా ఒక హాస్య కథను సేకరించి, బోర్డుమీద రాసి ప్రదర్శించండి. తరగతిలో అందరికీ చదివి విన్పించండి.